

# ధన్యారాము పండు దేశాన...?

## బి. నాదముని రాజు

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ." అందునా జన్మ భూమి నిజంగా రత్నగర్భ. వంటి కొక్క మెతుకు సహితం కరవు అయిం దా అభాగ్యునికి. ప్రవాసం తప్పలేదు. అయినా మమతలూ మమకారాలూ చావలేదు. మానవ హృదయంలో పేరుకొన్న ఆశ అలాంటిది.

"మీరు తెలుగువారాండీ!?"

నున్నటి సిమెంటు రోడ్డుమీద రిక్షా పాములా జారిపోతోంది. హిగిన్‌బాధమ్స్‌లో కొన్న పత్రికలోని శీర్షికలను చూస్తున్న నేను తల ఎత్తి ఆశ్చర్యంగా చూశాను.

బొంబాయిలాంటి మహానగరంలో దిగిన వెంటనే కలిగే తోటి తెలుగు సోదరుని పరిచయం ఆనంద మెవరికి గాదు?

రిక్షా పోతోంది.

నేను దిక్కులు చూశాను.

స్వచ్ఛమైన తెలుగుతో నాతో మాట్లాడిం దెవరో నా కర్థం గాలేదు.

తిరిగి తలవంచుకొని పుస్తకంలోకి చూపులు మరలించుకోబోతున్నాను.

"ఏ జిల్లా బాబూ తమది?" తిరిగి ప్రశ్న.

ప్రశ్న ఎక్కడినుంచి వెలువడిందో గుర్తించిన నేను విస్తుపోయాను.

రెండు క్షణికాలపాటు విస్ఫారిత నయనాలతో రిక్షావాలాకేసి చూశాను.

రెండు పదులు మొదలు నాల్గు పదుల వరకు వయసెంతయినా గావచ్చు. కాకీ

నిక్కరు, కారు నలుపు వర్ణము, బట్టమీద ఎర్రమట్టి చారల్లావున్న గళ్ళ హాఫ్‌షర్టు, జీబురు తల, మనిషి సన్నగా పీలగా ఉన్నాడు. అరంగుళం మందాన గడ్డం పెరిగివుంది. పై ప్రశ్నల్ని బట్టి అంతో ఇంతో చదువుకున్నవాడే కాబో లనుకున్నాను. అతని ముఖం, ముఖ్యంగా కళ్ళు చూడా లనుకున్నాను గాని అతడు వెనక్కి తిరిగి చూడలేదు.

వాన్‌లో రిక్షా త్రొక్కుకున్నా, బ్రేకులు వేస్తున్నా పాలరాయిలాంటి రోడ్లమీద రిక్షా వేగంగానే పోతోంది.

"గి—ర్—ర్—ర్". చక్రాలు తిరుగు తున్నాయి.

"ఓహో! నీవు తెలుగువాడవేనా? ఏ ప్రాంతం నీది?" ప్రశ్నించాను. అతన్నలా అడిగిన తర్వాత అత డడిగిన అవే ప్రశ్నలకు జవాబియ్యకుండా వాటినే నేనూ అడిగానని గుర్తించాను.

రిక్షావాలా తలత్రిప్పి వెనక్కి చూడలేదు. కాని జవాబిచ్చాడు. "ఆంధ్రుడ్నే బాబూ! మాది రాయలసీమ! కడపజిల్లా."

"కడపజిల్లా! వెయ్యి మైళ్ళ దూరంలోని ఈ మహానగరాని కొచ్చి రిక్షా త్రొక్కు తున్నావా?" ప్రశ్నించాను.

"వూ........హా.......". అది నిట్టూర్పో, బాధగా హృదయం ఆక్రోశించటమో నే నెరుగలేకపోయాను.

"మీ రెవరో చెప్పారు గాదు, బాబూ!" అత డడిగాడు.

"నేనూ నీవాడ్నే! మాది కూడ అ జిల్లానే!" అన్నాను నేను.

సన్నం ముగిసింది. రోడ్డు నిటారుగా నిలుచున్నట్టుంది. రిక్షావాలా తన శక్తినంతా పాదాల్లోకి కేంద్రీకరించుకొని సైకిల్ త్రొక్కు తున్నాడు. అయినా బండి యీడిగిలబడి నడు స్తోంది.

"తమరు......" రిక్షావాలా ఏదో ప్రశ్నించ బోయాడు. కాని దగ్గు తెర అతన్ని వుక్కిరి బిక్కిరి చేసింది. "క్—క్—క్—". ఒకటే దగ్గు.

రిక్షా ఆగింది.

ఆ ఆగటంతో రెండు బారలు వెనక్కి పరుగెత్తింది. అదృష్టవశాత్తూ వెనుక వాహనా లేం లేవు. రిక్షావాలా బలంగా బ్రేకులు పట్టు కున్నాడు. "అబ్బ! త్ ...." బలంగా వుమ్మి వేశా డతడు.

ఎరుపు—నలుపు వర్ణాలతో మిళితమైన రక్తం పుడిసెడు తుబుక్కున రోడ్డుమీద పడింది. అద్దంలాంటి రోడ్డుమీద పడ్డ ఎర్రడాగు వికృతంగా అవుపించింది.

"ఆ— ఏమయింది!" నా సర్వావయవాలూ

# ధాన్య రాసులు పండు దేశాన ...

జలదరించినట్లయి రిక్షా దిగబోయాను.

"దిగకూకండి బాబూ! ఇది మామూలే లెండి! పోదాం పదండి!" అతడు వారించాడు.

నేను విస్తుపోయాను! నా నోటినుంచి మాటలే వెలువడలేదు. రిక్షా తిరిగి బయలు దేరింది!

"మామూలు! మామూలు!" అదే పదాన్ని మనసులోనే ఎన్నోసార్లు మననం చేసుకున్నాను. ఈలాంటి విషాద దృశ్యాలన్నీ నా కళ్ళనే ఎందుకు పడతవి! మనసంతా చేదు విషంగా వుంది.

ఆకాశాన్నంటే రమ్య హర్మ్యాలు, సన్నని పిలిపాలవంటి బట్టల్లోంచి వంపు సొంపుల్ని ప్రదర్శిస్తున్న సీతాకోక చిలుకల్లాంటి చిగురు బోడులు, వళ్ళు విరుచుకుంటున్న పట్టణ నాగరకతలోని అంద చందాలు నన్నాకర్షించలేదు.

హోటల్‌లోని మూడో అంతస్థులో నాకు ప్రత్యేకించబడిన గదిని చేరుకున్నాను.

రిక్షావాలా పెట్టె బెడ్డింగ్ మోసుకువచ్చి నా గదిలో చేర్చాడు. కూలి డబ్బులకోసం నిలు చున్నాడు. అతని ముఖంపైపు పరికించి చూశాను. లోతుకు పీక్కుపోయిన చెక్కిళ్ళు, పొడుగాటి ముక్కు, అంగుళం పొడుగున ఎదిగిన గడ్డం, ఇదీ అతని రూపం! అతని పెద్ద కళ్ళలో నీలి నీడలు నడయాడుతున్నవి. కళ్ళలో కాంతి తరుగకున్నా ఆ కాంతితోపాటే ఒక ఎర్రజీర తళుక్ తళుక్‌మని మెరుస్తున్న ట్టుంది.

నేను మంచంమీద కూర్చుంటూ "కూర్చో" అన్నాను.

"పర్వాలేదు బాబూ!........" అతడు నిలుచునే అన్నాడు— "మీ చేతిలో పత్రిక చూస్తూనే మీరు తెలుగువా ళ్ళనుకున్నాను బాబూ! ఏమిటో తెలుగు ముఖాల్ని చూచినా, మన మాటలు విన్నా ఆపుకోలేనంత ఉత్సా హం వంటిలోకి వస్తుంది. అంతరాలు తెలియ కుండా మిమ్మల్ని ఏమిటో అడిగాను. మన్నిం చండి!"

"తప్పేంటూ వుం టేగదా మన్ననలు? మరేం పర్వాలేదు. మానవునిలోని సహజత్వమే నిన్నలా పలకరింపజేసింది. కూర్చో! పొద్దుపు గాని." అతడు నా బలవంతంమీద కూర్చు న్నాడు.

"బోయ్ ..బోయ్.." కేకవేసిందే తడవుగా హోటల్ సర్వర్ యూనిఫారంలో అవతరిం చాడు.

"రెండు ఓవల్టిన్".

"అయ్యో! నాకెందుకు బాబయ్యా!" అన్నాడతడు.

సర్వర్ నా సైగతో వెళ్ళిపోయాడు.

"సరే! ఏమిటి కథ! ఇంతదూరం ఎందుకని వచ్చావ్! నీ కెవరూ లేరా!" ప్రశ్నించాను.

నా ప్రశ్నతో గంభీరమైన అతని కళ్లలో నీరు గిర్రున తిరిగినట్లయింది. హృదయంలో నుంచి ఉప్పొంగుతున్న బాధ నణచుకుంటున్న వాడిలా గుటకవేశాడు.

"ఎందుకులెండి బాబూ! ముసురుకున్న తేనెటీగల తుట్ట నెందుకు లేపాలి? అక్కడ పరిస్థితులన్నీ బాగున్నాయా బాబూ! మనకు ప్రత్యేక రాష్ట్ర మొచ్చిన తర్వాత ప్రజల జీవనస్థాయేమైనా పెరిగిందా? గండికోట ప్రాజెక్టు కట్టారా? కడపనుంచి పులివెందులకు పోయే మార్గంలో మధ్య నున్నది వేంపల్లి. అదే మావూరు. మీరెప్పుడైనా చూచారా బాబూ! పాపఘ్నినది ఒడ్డున, గండిక్షేత్రానికి మైలు దూరంలో,చుట్టూ పదిమైళ్లనుంచి మా యొద్దుల కొండ మీది గుడి కూడ కనుపిస్తూ వుంటుందండీ!" అతని కళ్లలో ఆనందోద్వేగం తొణికిసలాడింది. పాలిపోయిన అతని చెక్కిళ్ళు వుబికినట్టున్నాయి! ఆమాట అతని నోటినుంచి కాదు వెలువడింది, గుండెల్లోంచి! గుండెలకు మాటలొస్తే—!

'జన్మభూమిని ప్రేమించని మనిషి మనిషేగా'డన్న ఒక ఆంగ్ల మహాకవి సూక్తి గుర్తుకొచ్చింది నాకు.

బోయ్ తెచ్చిన ఓవల్టిన్ ఇద్దరమూ త్రాగాము.

అతడు లేచాడు. కాదు కూర్చోమన్నాను. "రిక్షా అద్దెయినా..." అతని పెదాలు గొణగ బోయాయి. "నీ మామూలు రోజు సంపాదన నేనిస్తా"నన్నాను. అతను సిగ్గు పడ్డాడు. తలవంచుకుని నిస్పత్తువగా తిరిగి కూర్చు న్నాడు.

ఎంతో బలవంతం చేసిన తరువాత అతడు తన కథను చెప్పాడు.

మూడెకరాల నల్ల రేగడిపొలమే సర్వస్వమూ అయిన ఒక పేదరైతు కొడుకతను. ముగ్గురు ఆడపిల్లల తర్వాత కల్గిన ఏకైక మగ సంతానం కాబట్టి మురిపెంగా ముద్దుగా పెరిగాడు. వేంపల్లిలో ఉన్నత పాఠశాల ఆనాటికింకా వెలయలేదు. ఎనిమిదవ తరగతి మంచి మార్కులతో పాసు చేశాడతను. చురుకైన వాడు, అభివృద్ధికి రాతగ్గవాడు

అన్నారు మాస్టర్లతోపాటు అందరూను. అతడు కూడ పై చదువులు చదవాలని వుబలాట పడ్డాడు. మారాం చేశాడు. కూతుళ్ళ పెళ్ళిళ్ళుచేసి పొలాన్ని షావుకారికి కొదవ్వుపెట్టిన తండ్రి వెనుక ముందాడినా కాదనలేకపోయాడు. వేంపల్లికి పద్నెనిమిది మైళ్ల దూరంలోవున్న తాలూకా కేంద్రం పులివెందులలో అతని చదువు కొనసాగింది. హోటల్ తిండి, హాస్టల్ నివాసము. పేద రైతయినా కొడుక్కేకొరవా లేకుండా చేశాడతని తండ్రి. అబ్బాయి శిష్టాచారం చదివే రోజుల్లోనే అమ్మమ్మ మంచం పట్టింది. మనమడి పెళ్లి చూచిగాని కన్ను మూయుగూడదని పట్టు పట్టింది. ఫలితంగా అబ్బాయికి గంటల్లో పెళ్లయింది. వధువు మేనమామ కూతురు. పెళ్లి చూచి శాంతంగా ఆత్మతృప్తిగా కళ్ళు మూసే బదులు అమ్మమ్మ ఆరోగ్యాన్ని పుంజుకొని మరినాల్గేళ్ళు బతికింది. అబ్బాయి స్కూల్ ఫైనల్ ముగిసింది. షావు కారుకు పొలం రిజిస్టర్ చేసే తతంగం కూడ పూర్తి అయింది. పేద రైతు తాను నమ్ము కున్న భూమిని కోల్పోయి వ్యవసాయ కూలీగా పరివర్తన చెందాడు. కాని కొడుకు భవిష్యత్తు మీద భరవసా అతన్ని నిరాశాతప్తుడ్ని చేయలేదు. అతని పాలిటికి కొడుకు చదివించి ఉన్నతవిద్య! వెంటనే అబ్బాయి వుద్యోగస్తుడవుతాడు, కష్టాలు గట్టెక్కుతవని ఆశించాడు.

ఒకటి.. రెండు... మూడు... నాల్గేడు నడుస్తోంది. చదువుకు తగ్గ వుద్యోగం మాటటుంచి కనీసం జవాన్‌గిరి అయినా లభ్యం కాలేదు. అబ్బాయి అతడయ్యాడు. అతడు వృద్ధుడయ్యాడు. పండంటి మను మడు చేతికొచ్చిన సంసార దుస్థితి వృద్ధుడ్ని రోజురోజుకూ కృంగదీస్తోంది.

సర్వస్వాన్ని తనకోసం త్యాగం చేసిన తల్లిదండ్రులను ఆదుకోకపోవటం మటుంచి తన భారాన్ని కూడ వారి మీదే వేస్తున్నందు కతడెంతగానో కుంచించుకుని పోయేవాడు. నిరాశానిస్పృహలతనిలో తాండవించాయి. ఆత్మ హత్య చేసుకొని గుక్కెడు ప్రాణాన్నీ విసర్జిం చాలనుకొని అందుకు కూడ ధైర్యం లేక గుడ్ల నీరుగుక్కుకునేవాడు.

పస్తులు... ఆకలి ... నిట్టూర్పులు... పాలు లేక పసిపిల్లవాడి ఆక్రందనలు— ఏమీ చేయలేని అసమర్థుడు తను, చేతగాని వాజమ్మ. తనలో తానే కుమిలిపోయేవాడు.

ఎన్నిరోజులీలా?

ఒక అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చిందతనికి. ఎంత ప్రయత్నించినా తిరిగి నిద్దుర పట్టింది గాదు. పిశాచాల్లా ఆలోచనలు చుట్టుముట్టాయి. భయవిహ్వలుడయ్యాడు. దిగ్గున లేచి కనబడిన దారెంట గబగబ నడిచాడు. మరునాడు కడపలో బొంబాయి మెయి లెక్కాడు. గమ్యంలేని ప్రయాణం. అంత మహానగరం తనకాశ్రయ మివ్వక పోతుందా? ఏమో పరిస్థితు లెందుకని బాగుపడరాదు? ఏ అదృష్టదేవతో తన కడకంట ఒక చల్లనిచూపును తనవైపు బరుపుతే చాలదూ—తిరిగి అతనిలో ఆశ మిలమిలా మెరిసింది. తనకూ మంచికాలం రాగలదనే విశ్వాస మెందుకో అతనిలో హఠా త్తుగా పొడసూపింది.


కాలప్రవాహంలో ఒక అల కొనసాగిపోయింది. గిర్రున తిరిగాయి పది సంవత్సరాలు. అతని ఆశలు నిరాశలయ్యాయి. పొట్టకూటికోసం ఎన్ని చీవాట్లు తిన్నాడు! ఎన్ని అవతారాలెత్తాడు. కడకు రిక్షావాలాగా స్థిరపడ్డాడు. గడిచిన రెండేళ్ల వరకు యింటికేమైనా డబ్బు పంపాలని ఎంతగానో ప్రయత్నించి సఫలుడు కాలేక పోయాడు. రిక్షా యజమానికి యివ్వవలసిన అద్దెడబ్బులు పోను మిగిలేదేమిటి? కడుపునిండుగా గాకున్నా మరునాడు రిక్షా తోలేటందుకయినా శక్తి కలిగేందుకు తిండి తినవద్దూ! వచ్చిన క్రొత్తలో తిరిగి వీలయినంత త్వరలో స్వగ్రా మానికి పోవాలని, ఇల్లాలిని, పసికందును చూడా లని, తండ్రిని కడసారయినా చూడాలని వాంఛిం చుతూ వుండేవాడు. ఇప్పుడా ఆశగూడా అణగారి పోయింది! ఎవరూ ప్రత్యక్షంగా శిక్ష విధించక పోయినా అతనికి జీవితమే ఒక బందిఖానా అయి పోయింది.

ఇప్పుడతని ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని పోయింది. బలహీనత, బలహీనత తెచ్చిపెట్టిన దగ్గు. రెండు నెలలనుంచి దగ్గినప్పుడెల్లా రక్తం పడుతూంది.


అతని కథనాన్ని విన్న నేను నిశ్చేష్టుడ్నయాను. నా కళ్లల్లో నీరు గిర్రున తిరిగింది.

అతను జేబులోంచి కార్డుసైజున్న ఫోటో నొకదాన్ని తీసి నా చేతిలో పెట్టాడు. యాంత్రి కంగా నేను దాన్ని తీసుకున్నాను. పరిశీలనగా చూచాను. ఫోటో పదేళ్లకు ముందు నాటిది! ఏమిటేమిటో మరకలన్నీ పడి దాని రూపును మార్చుకున్నట్లుంది. ఫోటోలో ఒక యువతి చంకలో బిడ్డతో నిలుచుని వుంది. ఆమెకళ్లలో అమాయకత్వం తాండవిస్తోంది. శిశువు బోసి నోటితో కిలకిలా నవ్వుతున్నాడు. లోకాన్ని వరించుకున్న దౌష్ట్యపు ఛాయలు కూడ వారిని సోకినట్లు లేదు.

"బాబూ! నేనెన్ని నాళ్లో బ్రతుకను. మీరెప్పు డైనా మా వూరు మార్గాన వెళ్లితే రెండు నిమి షాలు వారిని కలుసుకొని, నేను వారికి కావాలని ఏ ద్రోహం చేయలేదని చెప్పండి! నాదేమైనా ద్రోహముంటే అది నేను బ్రతకటమే! అంతే బాబూ! అంతే!" అతను నా చేతులు పట్టుకొని



చిత్రకారుడు.. జి. రామస్వామి (హైదరాబాదు)



చెప్పాడామాటలు గద్గదస్వరంతో. అతని కళ్ళ నుండి ధారాప్రవాహంగా అశ్రువులు జాలువా రాయి.

నాకు నోరుపెకిలి రాలేదు. "ధాన్యరాశులు పండు దేశాన కూటికి గుడ్డకు కొదువ లేదోయి" అనే చరణం రేడియోలోనుంచి వినిపిస్తూంటే నిట్టూర్పువిడిచి అతనిచేతులు పట్టుకొన్నాను. ★